
సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం | 29 | ఆగస్టు | 2024



క్రీడల్లో ఆణిముత్యాలు
ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.
వివరాలు 8లో ▸



జూరాలకు భారీ వరద
ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.4 /22.4

వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.6201

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 1,417 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6201, కనిష్టం రూ.2206, సరాసరి రూ.4269 ధరలు పలికాయి.

రేపు సీతారాముల కల్యాణం



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 10గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రాములోరి కల్యాణ వేడుక కనులారా చూడాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: 2024–25 రాష్ట్రీయ బాలశక్తి పురస్కార్ అవార్డులకు అర్హులైన చిన్నారులు దరఖాస్తు చేసుకోవాలని డీడబ్ల్యూఓ సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతిక తదితర రంగాల్లో ప్రతిభ చాటిన 06–18ఏళ్లలోగా బాలబాలికలు ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

స్టాఫ్‌నర్సు పోస్టుకు..

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో టీ–ఎస్ఏసీఎస్ విభాగంలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ వర్క్, సైకాలజీ, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, హ్యూమన్ డెవలప్ మెంట్, నర్సింగ్ గ్రాడ్యుయేట్, డిగ్రీ పూర్తి చేసి నేషనల్ హెల్త్ ప్రోగాం, ఎన్ఏసీపీలో సంవత్సరం పాటు అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



గద్వాల రూరల్: యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ కళాశాలల్లో బోధిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో నదిఅగ్రహారంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో అధ్యాపకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, పీజీ కళాశాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేస్తూ పేస్కేల్‌తో ఉద్యోగభద్రత కల్పించాలని, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు శ్రీనివాసులు, మహేందర్, గోపీనాథ్, గణేష్, మహ్మద్ రఫీ, నవీన్ గౌడ్ ఉన్నారు.

ఆటలకు ఆదరణేది..?

ఒకప్పుడు జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల రాణింపు



గద్వాల స్టేడియంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

- క్రికెట్, ఫుట్‌బాల్‌లలో ఆటగాళ్ల సత్తా
- కాలక్రమేణా నిర్వహణ లోపాలతో ఆటల్లో వెనకబడిపోతున్న వైనం
- నేడు జాతీయ క్రీడాదినోత్సవం

గద్వాల టౌన్: క్రీడల నిర్వహణలో గద్వాలకు గతంలో ఘనమైన చరిత్ర ఉంది. వివిధ పోటీల్లో పాల్గొనడానికి చాలా మంది జాతీయ క్రీడాకారులు జిల్లాకు వచ్చేవారు. ఎన్నో రాష్ట్ర స్థాయి పోటీలకు వేదికగా నిలిచిన ఖ్యాతి జిల్లాకు ఉంది. ఇలాంటి పట్టణంలో క్రీడలు మరింత అభివృద్ధి చెందాల్సిందిపోయి నానాటికీ తీసికట్టుగా తయారయ్యాయి. మౌలిక సదుపాయాల ఏర్పాటును అటు పాలకులు, ఇటు అధికారులు మరిచారు. క్రీడా క్యాలెండర్‌ను పాటించిన పాపానపోలేదు. ప్రస్తుతం క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ జిల్లా కేంద్రాలకే పరిమితం కావడం.. అవి కూడా మొక్కుబడిగా మారడంతో ప్రతిభ ఉండి వెళ్లలేని దుస్థితి క్రీడాకారులకు నెలకొంది.

ఫుట్‌బాల్, క్రికెట్‌లో గద్వాల అదరహో..

పట్టణంలో ఆరు దశాబ్దాల క్రితమే ఫుట్‌బాల్ క్రీడను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా అసోసియేషన్ నిర్వాహకులు పోటీలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంతానికి చెందిన దొరస్వామి, నఖ్వీ వంటి క్రీడాకారులు అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌కు చెందిన సభ్యులే ఫుట్‌బాల్‌ను భుజాన వేసుకొని ప్రోత్సహిస్తూ.. క్రీడాకారులకు అండగా నిలుస్తున్నారు. ఫుట్‌బాల్ అంటే గద్వాల అనే విధంగా ఉమ్మడి జిల్లాలో మార్మోగింది. దీంతోపాటు గత కొన్నేళ్లుగా క్రికెట్‌లో సైతం గద్వాల క్రీడాకారులు విశేష ప్రతిభ కనపరుస్తున్నారు. ప్రతి యేటా నలుగురు, ఐదుగురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపిక అవుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులు, యువకులు క్రికెట్‌పై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తైక్వాండో పోటీలలో సైతం క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులు తైక్వాండోలో శిక్షణ పొందుతున్నారు. ఇటీవల కాలంలో అథ్లెటిక్స్ పోటీలపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత రెండు మూడు ఏళ్లుగా కొందరు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనపరుస్తున్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఫుట్‌బాల్, క్రికెట్, తైక్వాండో కరాటేకున్న క్రేజీ గద్వాలలో మరే క్రీడకు లేదు. కబడ్డీ, వాలీబాల్, షటిల్ సీనియర్ క్రీడాకారులు తమ వంతుగా క్రీడను కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా క్రీడాకారులకు తర్ఫీదు ఇస్తున్నారు.



పూర్తిస్థాయి హంగులకు నోచుకోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

భరోసా ఇవ్వాలి..



క్రీడా ప్రాతిపదికన విద్యను పూర్తిచేసే విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం ఎటువంటి సహాయం అందించడం లేదు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ప్రభుత్వం వారి చదువులకు భరోసా ఇవ్వాల్సి ఉంది. గ్రామీణ స్థాయిలో ఎందరో ప్రతిభ గల క్రీడాకారులున్నారు. వారికి సరైన మార్గదర్శి లేక వెలుగులోకి రావడం లేదు.

– శ్రీనివాసులు, క్రికెట్ కోచ్, గద్వాల

క్రీడలను బలోపేతం చేస్తాం



పాఠశాల స్థాయిలో క్రీడలను బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టాం. క్రీడా బడ్జెట్‌తో పాటు మైదానాల్లో అన్ని వసతులు కల్పించడానికి ప్రతిపాదనలు రూపొందించాం. వేసవి శిక్షణా శిబిరాల సామర్థ్యాన్ని మరింత పెంచడానికి కృషి చేస్తాం. ప్రతిభావంతులకు ప్రభుత్వ సహకారంతో ప్రోత్సహిస్తాం.

– బీఎస్ ఆనంద్, డీవైఎస్ఓ

కానరాని మైదానాలు

క్రీడలకు పునాదిగా భావించే పాఠశాలల్లో క్రీడా మైదానాలు కరువయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మైదానాల కొరత ఉంది. గ్రామీణ ప్రాంతాలలో తాతల కాలం నాటి ఏర్పాటు చేసిన పాఠశాలల్లో అరకొర చదువుల మధ్య ఆటల సంగతే మరిచారు. కొత్త భవనాలు నిర్మిస్తున్నారే తప్పా మైదానాలను విస్మరిస్తున్నారు. గత ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలలో చిత్తశుద్ధి కనిపించ లేదు. దీంతో విద్యార్థులకు ఆటలు అందని ద్రాక్షగానే మారాయి. ఇక ప్రైవేటు పాఠశాలల పరిస్థితి మరీ దారుణం. బహుళ అంతస్తులలో పాఠశాలలు నిర్వహిస్తూ పిల్లల క్రీడా వికాసానికి విఘాతం కల్గిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న నల్లసోమనాద్రి స్టేడియం చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతుంది. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఒక్కటే జిల్లాకు తలమానికంగా నిలిచింది. అదికూడా పూర్తిస్థాయి హంగులకు నోచుకోలేదు. స్టేడియంలో అరకొర వసతులు ఉండటం వలన అన్ని క్రీడలు ఆడలేని పరిస్థితి ఉంది.

జాతీయ క్రీడా దినోత్సవానికి ఏర్పాట్లు



ఫ్లెక్సీని విడుదల చేసిన కలెక్టర్ సంతోష్

గద్వాల: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ సంతోష్ బుధవారం హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ ఫ్లెక్సీని కలెక్టరేట్‌లో విడుదల చేశారు. గురువారం నిర్వహించనున్న కార్యక్రమాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 6:30 గంటలకు ఇండోర్‌స్టేడియంలో మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 6:40 గంటలకు రాష్ట్ర స్థాయి స్వర్ణ పతక విజేతలకు సన్మానం, 6:50 గంటలకు జాతీయ స్థాయి తైక్వాండో రెఫరీగా ఎంపికైన సభ్యునికి సన్మానం చేయనున్నారు. 7:10 గంటలకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ సంతోష్ హాజరవుతారని జిల్లా క్రీడాధికారి బీఎస్ ఆనంద్ తెలిపారు.

ముగిసిన జములమ్మ కల్యాణ మహోత్సవం



ధ్వజ అవరోహణం పూజలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

గద్వాల టౌన్: జములమ్మ తల్లి కల్యాణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన మహోత్సవాలు బుధవారం సాయంత్రం ధ్వజ అవరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ గాయత్రి, మాజీ చైర్మన్ సతీష్‌కుమార్, కమిటీ సభ్యులతో సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి ధ్వజ అవరోహణం చేశారు. మంగళవారం రాత్రి నిర్వహించిన జములమ్మ తల్లి పల్లకీసేవ రమణీయంగా సాగింది. అందంగా అలంకరించిన పల్లకీపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య ఊరేగించారు. పల్లకీ ముందు ప్రత్యేక పూజ నిర్వహించి గుమ్మడి కాయతో హారతి ఇచ్చారు. పల్లకీ సేవలో పలువురు కళాకారులు కోలాట ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్లు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



‘ఐకానిక్’ దిశగా..

- జాతీయ రహదారి–167కే పనులు వేగవంతం
- కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 80 శాతం పూర్తి
- కృష్ణానదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం
- త్వరలో పనులు చేపట్టే అవకాశం

కొల్లాపూర్: తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న జాతీయ రహదారి–167కే పనుల్లో వేగం పెరిగింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మందకొడిగా సాగిన పనులు.. ఇటీవల ఊపందుకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో బైపాస్ రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఏపీలోని నంద్యాల – ఆత్మకూరు మధ్య రహదారి విస్తరణ కొనసాగుతోంది. గతేడాది వాయిదా పడిన ఐకానిక్ వంతెన పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది.

ఏపీలోనూ శరవేగంగా..

ఎన్‌హెచ్–167కే ప్యాకేజీ–4, 5లో భాగంగా ఏపీలోని నంద్యాల– ఆత్మకూరు మధ్య రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నంద్యాల నుంచి కడప జిల్లాలోని జమ్ములమడుగు వరకు రహదారిని పొడిగించారు. ఏపీలోని నాలుగు ప్రాంతాల్లో బైపాస్ రహదారులు నిర్మించనున్నారు. ఆయా ప్రాంతాల్లో కొంతమేర భూసేకరణ పెండింగ్‌లో ఉంది.

పరిహారం చెల్లింపులో జాప్యం..

కల్వకుర్తి సమీపంలోని తాడూరు– ఐటిక్యాల మధ్య, కొల్లాపూర్ సమీపంలో బైపాస్ రహదారులు నిర్మిస్తున్నారు. అందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది. అయితే పరిహారం చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. కొల్లాపూర్ సమీపంలోని చౌటబెట్ల శివారులో 80 శాతం మందికి పరిహారం చెల్లించగా.. సాంకేతిక సమస్యల కారణంగా మరో 33 మందికి పరిహారం అందలేదు. వరిదేల శివారులో భూములు కోల్పోతున్న వారికి త్వరలోనే పరిహారం అందించాల్సి ఉంది. సింగోటం క్రాస్‌రోడ్‌లో బైపాస్ రహదారి పనులు ప్రారంభం కాగా.. నాగర్‌కర్నూల్‌లో పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోంది.



కొల్లాపూర్ సమీపంలో బైపాస్ నిర్మాణ పనులు

జిల్లాలో పనులు ఇలా..

భారత్‌మాల పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు 167కే జాతీయ రహదారిని మంజూరు చేసింది. అందులో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని మల్లేశ్వరం సమీపంలో కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. మొదటి విడతగా కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 85 కి.మీ., మేర రహదారి విస్తరణ, బైపాస్, అండర్‌పాస్ నిర్మాణాలను రూ.436.91 కోట్లతో చేపట్టేందుకు 2021 సెప్టెంబర్ 26న టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. గతేడాది జూలైలో పనులు ప్రారంభించగా.. ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. రహదారిపై అవసరమైన కల్వర్టుల నిర్మాణం, మేడిపూర్ సమీపంలో మినీ బ్రిడ్జి పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత మల్లేశ్వరం నుంచి సంగమేశ్వరం వరకు కృష్ణానదిపై నిర్మించబోయే ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జిపై అనేక ఊహాగానాలు వచ్చాయి. వంతెన నిర్మాణం జరగదంటూ కొల్లాపూర్ ప్రాంతంలో విస్తృత ప్రచారం జరిగింది. జాతీయ రహదారి నిర్మాణంలో మార్పులు ఉంటాయని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేశారు.

ఊహాగానాలకు తెర..

అయితే ఆయా ఊహాగానాలకు తెరదించుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఐకానిక్ వంతెన నిర్మాణానికి టెండర్లు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. టెండరు దాఖలుకు సెప్టెంబర్ 19 చివరి తేదీగా ప్రకటించింది. అక్టోబర్ లేదా నవంబర్‌లో టెండర్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అప్పటిలోగా కొల్లాపూర్ నుంచి ఆత్మకూరు వరకు రహదారి నిర్మాణానికి అవసరమైన భూముల కోసం అటవీశాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకునేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది.

■ జాతీయ రహదారి, ఐకానిక్ వంతెన నిర్మాణంపై ఇటీవల కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సంబంధిత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. వంతెన పనులు వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. అలాగే ఈ నెల 24న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా గడ్కరీని కలిసి వంతెన నిర్మాణం త్వరగా చేపట్టాలని వినతిపత్రం అందజేశారు.


చౌటబెట్ల రోడ్డులో చౌరస్తా..



కొల్లాపూర్ నుంచి చౌటబెట్లకు వెళ్లే దారిలో అండర్‌పాస్ నిర్మాణం చేపడతారనే ప్రచారం జరుగుతోంది. ఈ దారి గుండా బోయలపల్లె, తాళ్లనర్సింగాపురం, చింతలపల్లి, పెంట్లవెల్లి, ఎన్మన్‌బెట్ల, సింగోటం, తూంకుంట, కొండూరు, బొల్లారం గ్రామాలకు వెళ్లవచ్చు. అండర్‌పాస్ నిర్మాణానికి బదులుగా అక్కడ చౌరస్తా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఈ దిశగా అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలి.

– మేనుగొండ రాముయాదవ్, చౌటబెట్ల

పరిహారం చెల్లిస్తాం..



కొల్లాపూర్ సమీపంలో బైపాస్ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే వారికి పరిహారం చెల్లిస్తున్నాం. చౌటబెట్ల శివారులో సాంకేతిక సమస్యల కారణంగా కొందరికి పరిహారం అందలేదు. వాటిని సరి చేస్తున్నాం. వరిదేల శివారులో భూములు కోల్పోతున్న వారికి త్వరలోనే పరిహారం అందుతుంది. ఈ అంశంపై ఇప్పటికే మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నతాధికారులతో మాట్లాడారు. బైపాస్ నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– నాగరాజు, ఆర్డీఓ, కొల్లాపూర్

అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతికి కృషి



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ సహజాది, పక్కన కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ ఆర్.గిరిధర్

వనపర్తి: అల్ప సంఖ్యాక వర్గాల అభ్యున్నతికి కేంద్రం కృషి చేస్తోందని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ సహజాది చెప్పారు. బుధవారం ఆమె జిల్లాలో పర్యటించారు. స్థానిక మైనార్టీ గురుకులం విద్యార్థులతో అల్పాహారం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్ హాజరవగా.. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మైనార్టీలకు సంబంధించిన పాఠశాలలు, గురుకులాలు ఎన్ని ఉన్నాయి, పక్కా భవనాల్లో కొనసాగుతున్నవి ఎన్ని, మొత్తం విద్యార్థులు ఎంత మంది, వారికి కల్పిస్తున్న సౌకర్యాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలు 15, ఉన్నత పాఠశాలలు 3 ఉన్నాయని వాటిలో 652 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు తెలియజేశారు. షాదీ ముబారక్, నైపుణ్య శిక్షణ, షాదీఖానాల నిర్మాణం, ప్రధాన మంత్రి జన్ ఆవాస్ యోజన, వక్ఫ్ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రూ.లక్ష సబ్సిడీ రుణాలు వంద మందికి, 280 కుట్టు మిషన్లు, 9,809 మంది మైనార్టీ విద్యార్థులకు రూ.652 లక్షల పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లు ఇచ్చినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ అధికారి, ఆర్డీఓ పద్మావతి తెలియజేశారు. ఖిల్లాఘనపురం, ఆత్మకూరు మండలాల్లో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురైనట్లు ఆర్డీఓ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిటీ సభ్యులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. జిల్లాలో అల్ప సంఖ్యాక వర్గాల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. ఎస్పీ ఆర్.గిరిధర్ మాట్లాడుతూ.. జిల్లాలో ట్రిపుల్ తలాక్ వంటి కేసులు నమోదు కాలేదని, శాంతి భద్రతల విషయంలో ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. అంతకు ముందు కమిషన్ సభ్యులు సయ్యద్ సహజాదికి కలెక్టర్, ఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందజేసి కలెక్టరేట్‌కు స్వాగతం పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు

నారాయణపేట: రాబోయే వేసవి కాలంలో ప్రతి గ్రామంలో గృహవినియోగదారులకు, వ్యవసాయ బోర్లకు, పరిశ్రమలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని.. ఈమేరకు యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారుఖీ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ అధికారుల సమీక్ష సమావేశానికి సీఎండీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కింద ఎంత మంది లబ్ధిదారులకు జీరో బిల్లులను అందజేశారని, అర్హులందరికీ పథకం వర్తించేలా చూడాలన్నారు. ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. లోడింగ్‌కు తగిన విధంగా ఎక్కడికక్కడ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, ఏమైనా ఇబ్బందులు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్వాలిటీ పవర్, ఓవర్‌లోడ్, పవర్ డిమాండ్ తదితర వాటిపై సమీక్షించారు. అంతకుముందు తొలిసారిగా నారాయణపేటకు వచ్చిన సీఎండీని జిల్లా విద్యుత్ శాఖ అధికారులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. సమావేశంలో సీజీఎం బిక్షపతి, ఎస్ఈ ప్రభాకర్, ఎస్ఏఓ బీచుపల్లి, డీఈ నర్సింగ్ రావు, ఏడీఈ నందకిషోర్, డీపీడీఈ కాంతరావు, ఏఈలు పాల్గొన్నారు.



పుష్కఘాట్ వద్ద శివాలయం సమీపానికి చేరిన వరద నీరు


బీచుపల్లిలో మునిగిన పుష్కరఘాట్లు

ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. ప్రాజెక్టు నుంచి 45 గేట్ల ద్వారా దాదాపుగా 3 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు వదులుతున్నారు. దీంతో ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి వద్ద బుధవారం కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తుండటంతో పుష్కరఘాట్లు వరద నీటిలో మునిగిపోయాయి. కృష్ణానదికి వరదనీరు అధికంగా రావడంతో శివాలయం సమీపానికి నీరు చేరింది.

– ఎర్రవల్లి

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టులో పూడిక తీయాలని, ప్రాజెక్టు క్రాస్ డాప్టులు, షట్టర్లకు మరమ్మతు చేయాలని, ఆర్డీఎస్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నల్లచట్టాల రద్దు హామీని వెంటనే అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం రైతాంగానికి రూ.2లక్షల పంట రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని, కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా ఇవ్వాలని, భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖాజామైనుద్దీన్, సత్యారెడ్డి, రాముడు, మహేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతాంగ సమితి నాయకులు

క్లుప్తంగా

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ రూరల్: కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన దేశిటిక్యాల సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేశిటిక్యాలకి చెందిన కృష్ణమాచారి(42) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం స్వగ్రామం నుంచి కొల్లాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా.. కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు.

బావిలో పడి వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని ఉయ్యాలవాడలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. ఉయ్యాలవాడకు చెందిన రాముడు (38) కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. గ్రామ సమీపంలోని ఎర్రగొల్లు బావిలో స్నానం చేసేందుకు వెళ్లిన అతడు.. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సర్జరీ చేస్తుండగా గుండెపోటుతో వ్యక్తి..


బత్కన్న(ఫైల్)

అయిజ: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గద్దె పోగు బత్కన్న (45) కొన్ని రోజుల కిందట సంగారెడ్డిలో చర్చి నిర్మాణం పనులకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చర్చి గోడకూలి రెండు కాళ్లు విరిగిపోయాయి. బత్కన్నకు మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ ఆస్పత్రిలో వారం రోజుల నుంచి వైద్యులు చికిత్స చేశారు. అయితే బుధవారం బత్కన్న కాళ్లకు వైద్యులు సర్జరీ చేస్తున్న సమయంలో గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

పెద్దకొత్తపల్లి: మండలంలోని కొంద్రావుపల్లికి చెందిన జక్కుల ప్రదీప్ (29) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. కల్వకోలులో మంగళవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో జక్కుల ప్రదీప్‌కు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం


రాంజీ (ఫైల్)

మిడ్జిల్: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మిడ్జిల్ మండలం నాయకుడి తండాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. నాయకుడి తండాకు చెందిన రాంజీ (59) తాగిన మైకంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జడ్చర్ల ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు



అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. వనపర్తి జిల్లా గోపాల్‌పేటకు చెందిన ఐదుగురు కారులో బుధవారం మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో జానంపేట శివారులో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి కారు అదుపు తప్పి బోల్తాపడింది. అందులో ఉన్న చంద్రశేఖర్, శ్రీనివాస్, నవీన్, రాజేశ్వరి, అలివేలమ్మలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు బోల్తాపడిన వాహనం నుంచి అతికష్టం మీద బయటకు తీశారు. వారిని జానంపేట పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత వారిని అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు.

క్రీడల్లో పాలమూరు ఆణిముత్యాలు

ఉమ్మడి జిల్లాలో నైపుణ్యం గల క్రీడాకారులకు కొదువలేదు. ఇప్పటికే పలు పోటీల్లో అంతర్జాతీయ, జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కొంతమంది క్రీడాకారులు సాధించిన విజయాలపై కథనం..

– మహబూబ్‌నగర్ క్రీడలు

జూడోలో ప్రతిభ చాటుతున్న రాథోడ్ సావిత్ర



నారాయణపేట జిల్లా లింగంపల్లి పాతతండాకు చెందిన రాథోడ్ సావిత్ర చిన్నప్పటి నుంచి క్రీడల్లో రాణిస్తుంది. జిల్లా, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికల్లో ప్రతిభ చాటి ఏడేళ్ల క్రితం ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశం పొందింది. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సావిత్ర జూడో క్రీడాకారిణిగా ప్రతిభ చాటుతుంది. మూడు సార్లు జూడో ఉమెన్స్ ర్యాంకింగ్స్ లీగ్, మరో మూడుసార్లు జాతీయస్థాయి జూడో పోటీల్లో పాల్గొంది. కేరళ రాష్ట్రం త్రిసూర్‌లో 2022లో –48 వెయిట్ కేటగిరీలో, గతేడాది జనవరి–ఫిబ్రవరి, నవంబర్– డిసెంబర్‌లో కేరళ రాష్ట్రం త్రిసూర్‌లో జరిగిన ఉమెన్స్ లీగ్‌లో పాల్గొంది. చెన్నైలో 2022లో, పంజాబ్ రాష్ట్రం లూధియానాలో 2023లో, కర్ణాటకలో జరిగిన నేషనల్ జూడో పోటీల్లో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించింది.

ఒలింపిక్స్‌లో ఆడాలని ఉంది..

ఇప్పటికే పలు జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొన్నా. వచ్చే నెల 7వ తేదీన చెన్నైలో జరిగే ఉమెన్స్ లీగ్ పోటీలకు సన్నద్ధమవుతున్నా. పతకం రావాలనే నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా. జూడో క్రీడలో ఒలింపిక్స్‌లో ఆడాలని ఉంది. – రాథోడ్ సావిత్ర, జూడో క్రీడాకారిణి, నారాయణపేట

ఆర్చరీలో రాణిస్తున్న విష్ణువర్ధన్



- 15 సార్లు జాతీయస్థాయి పోటీల్లో

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.విష్ణువర్ధన్ పదేళ్ల నుంచి ఆర్చరీలో విశేషంగా రాణిస్తున్నాడు. తండ్రి ఎస్.రాఘవేందర్ జిల్లా కేంద్రం మెట్టుగడ్డ చౌరస్తాలో టీస్టాల్ నిర్వహిస్తున్నాడు. కుమారుడికి క్రీడలపై ఆసక్తిని గమనించిన తండ్రి ఖర్చు అయినప్పటికీ ఆర్చరీలో శిక్షణ ఇప్పిస్తున్నాడు. 2002లో హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) హాస్టల్‌లో ఉంటూ ఒక పక్క ఆర్చరీలో కోచింగ్ తీసుకుంటూనే మరో పక్క డిగ్రీ చదివాడు. 2022 నుంచి ప్రతి ఏడాది జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం విశేషం.

రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీల్లో

ఈయన ఇప్పటివరకు 30కిపై రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయిలో 15 సార్లు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. 2017లో మణిపూర్ ఇంపాల్‌లో అండర్–14 63వ ఎస్‌జీఎఫ్‌ఐ టోర్నీ, 2019లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలో అండర్–14 జాతీయ స్థాయి, ఢిల్లీలో 64వ ఎస్‌జీఎఫ్‌ఐ, 2020లో 65వ ఎస్‌జీఎఫ్‌ఐ జార్ఖండ్ రాష్ట్రం రాంచీ, రాజస్థాన్ రాష్ట్రం నీమ్ రానాలో 39వ సబ్‌జూనియర్, గోవాలో 42వ జూనియర్ నేషనల్, పంజాబ్‌లో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ, 2023లో రాజస్థాన్‌లో జరిగిన 43వ ఎన్‌టీపీసీ జూనియర్ నేషనల్, పంజాబ్‌లో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నాడు. హర్యానాలో జరిగిన ఆలిండియా శాయ్ టోర్నీలో వెండి పతకం సాధించాడు. ఈ ఏడాది మార్చిలో చెన్నైలో జరిగిన ఖేలో ఇండియా ఎన్‌టీపీసీ సౌత్ జోన్, జూన్‌లో కోల్‌కతాలో జరిగిన ఆలిండియా శాయ్ ఆర్చరీ టోర్నమెంట్‌లో పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించాడు. ఏప్రిల్‌లో బోల్‌పూర్‌లో జరిగిన ఎన్‌టీపీసీ ఎన్‌ఆర్‌ఏటీ టోర్నీలో, ఈనెల 10 నుంచి 19 వరకు గౌహటిలో ఎన్‌టీపీసీ ఎన్‌ఆర్‌ఏటీ టోర్నీలో పాల్గొన్నాడు.

ఇంటర్నేషనల్‌లో ఆడాలన్నదే లక్ష్యం..

కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద జిల్లా కేంద్రంలో మొదట్లో శిక్షణ తీసుకున్నా. ప్రస్తుతం హైదరాబాద్‌లో శాయ్ హాస్టల్‌లో ఉంటూ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నా. భవిష్యత్‌లో ఇంటర్నేషనల్ ఆర్చరీ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా.

– విష్ణువర్ధన్, ఆర్చరీ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్

జిమ్నాస్టిక్‌లో జాదవ్ జయ

- ఐదు జాతీయ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం



నారాయణపేట జిల్లా లింగంపల్లిపాత తండాకు చెందిన జాదవ్ జయ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్‌లో రాణిస్తుంది. హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంటున్న జయ కొన్నేళ్ల నుంచి జిమ్నాస్టిక్‌లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. 2017లో రాజస్తాన్‌లో జరిగిన జూనియర్ నేషనల్, 2019లో కోల్‌కతాలో జరిగిన 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, 2022లో కేరళలో జరిగిన జూనియర్ ఆర్టిస్టిక్, గతేడాది గోవాలో జరిగిన 37వ నేషనల్ గేమ్స్, ఢిల్లీలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంది. జయ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో చదువుతోంది. 'చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. హైదరాబాద్ హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి నుంచి చదువుతున్న. స్పోర్ట్స్ స్కూల్‌లో చేరిన మరుసటి ఏడాది నుంచి నాకు జిమ్నాస్టిక్‌లో శిక్షణ అందజేస్తున్నారు. త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది.' అని జాదవ్ జయ పేర్కొన్నారు.

రైస్‌మిల్లు యజమాని ఆస్తుల జప్తు



పాన్‌గల్: కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశానుసారం బుధవారం మండలంలోని కేతేపల్లి వెంకటసాయి రైస్ మిల్లు యజమాని నర్సింహులునాయక్‌పై రెవెన్యూ రికవరీ(ఆర్‌ఆర్) యాక్ట్ అమలు చేశారు. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యానికి 2021–22 సంవత్సరంలో ఇవ్వాల్సిన సీఎమ్మార్ బియ్యం చెల్లింపులో విఫలమైనందున రూ.3.70 కోట్లు చెల్లించాలని రెవెన్యూ అధికారులు మూడు దఫాలుగా నోటీసులు జారీ చేశారు. చివర పంపిన నోటీసు గడువు ముగియడంతో తహసీల్దార్ సుభాష్‌నాయుడు, డీటీ అశోక్, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, పోలీసుల సహకారంతో మిల్లులో ఎల్‌ఈడీ గోడ టీవీ, రెండు మోటార్ సైకిళ్లను గ్రామపంచాయతీ ట్రాక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జప్తు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి నగదు పంపి..

ఉండవెల్లి: మండలంలోని కలుగొట్లకి చెందిన హనుమంతు ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూస్తూ.. ఒక యాప్‌ను క్లిక్ చేశాడు. నగదు పంపితే వాటికి రెండింతల నగదు వస్తుందని జూలై 30 నుంచి ఈ నెల 21 వరకు మొత్తం ఆరు విడతల్లో రూ.1,96,844 నగదు పంపించాడు. అప్పటికీ నగదు తిరిగి రాకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సైబర్‌క్రైంలో ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేశారు. వర్క్‌ఫ్రం హోం జాబ్ ఉందని ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్ వచ్చిందని, దానిని క్లిక్ చేయడంతో టాస్క్ వచ్చింది. డబ్బులు డిపాజిట్ చేసినా రాకపోవడంతో సదరు వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్..
ఇద్దరు యువకుల దుర్మరణం


అశోక్ (ఫైల్)


చందు (ఫైల్)

కొత్తకోట రూరల్: అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బుధవారం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి స్టేజీ సమీపంలో చోటు చేసుకుంది. పెద్దమందడి ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బోయ అశోక్(21), బోయ చందు(19) ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై తండా నుంచి గ్రామానికి వస్తుండగా.. వనపర్తి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ఖిల్లాఘనపురం మీదుగా మహబూబ్‌నగర్ వెళ్తుండగా స్థానిక మజీద్ సమీపంలోకి రాగానే బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు గంటపాటు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న మృతుల బంధువులు, గ్రామస్తులకు నచ్చజెప్పారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జనరల్ ఆస్పత్రి మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో చంద్రశేఖర్‌రెడ్డి ఇంటికి తాళంవేసి పొలానికి వెళ్లగా.. గుర్తుతెలియని దుండగుల ఇంటి తాళాన్ని పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. లక్ష నగదు, 45 గ్రాముల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలను చోరీ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కృష్ణంరాజు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మైనింగ్ పనుల నిలిపివేత


సల్కాపురం, జోకన్‌గట్టు గుట్టల్లో నిలిచిన మైనింగ్ పనులు

- తహసీల్దార్‌కు చూపించని అనుమతి పత్రాలు
- అనుమతులు లేకుండానే గుట్టల్ని గుట్టుగా కొల్లగొడుతున్న వైనం

గట్టు: జాతీయ రహదారి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున మైనింగ్ నిర్వహిస్తున్న ఓ బడా కంపెనికి అనుమతులపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మూడు రోజుల క్రితం సల్కాపురం, జోకన్‌గట్టు గుట్టల్లో నిర్వహించిన పేలుళ్లకు మధ్యప్రదేశ్‌కు చెందిన పొక్లెయినర్ డ్రైవర్ విజయ్‌కుమార్ సింగ్ గోండు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత సదరు క్రషర్ నిర్వాహకులను స్థానిక తహసీల్దార్ సరితారాణి కార్యాలయానికి పిలిపించి మైనింగ్ అనుమతులు చూపించాల్సిందిగా కోరారు. అయితే నిర్వాహకులు కేవలం పొల్యూషన్ పత్రాలు, ఎన్‌ఓసీ పత్రాలను మాత్రమే తహసీల్దార్‌కు చూపించారు. అనుమతి పత్రాలను చూపించే దాకా క్రషర్‌ను మూసి వేయాల్సిందిగా ఆదేశించారు. అయితే రెండు రోజులు గడిచినా సంబంధించి క్రషర్ నిర్వాహకులు మైనింగ్ అనుమతి పత్రాలను చూపించలేదని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణానికి మట్టిని తరలించాలన్నా అనుమతులు తప్పనిసరి లేకపోతే వాహనాలను క్షణాల్లో సీజ్ చేసి, కేసు నమోదు చేసే అధికారులు సల్కాపురం, జోకన్‌గట్టు గుట్టల్లో బహిరంగంగా మైనింగ్ జరిపి, పెద్ద పెద్ద టిప్పర్లలో కంకరను తరలిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్న లేవనెత్తింది. ఆది నుంచి సదరు బడా కంపెనీ అనుమతులపై దాట వేసే ధోరణి కనబర్చుతున్నట్లు ఆరోపణలున్నాయి. పలుకుబడి కలిగిన నేత కావడంతో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్టర్‌లో సొంత ఇంటి నిర్మాణానికి ఇసుకను తరలిస్తే కూడా కేసులు నమోదు చేసే పోలీసులు అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ నిర్వహిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని సల్కాపురం, జోకన్‌గట్టు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బ్లాస్టింగ్ నిర్వహించినప్పుడల్లా మట్టి మిద్దెలు అదిరి మట్టి నేల రాలుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. కంకరను తరలిస్తున్న టిప్పర్ల కారణంగా సల్కాపురం, గట్టు రోడ్డు దెబ్బతిన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డు పక్కన పంటలపై దుమ్ము పేరుకుని పంట దిగుబడి తగ్గుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. టిప్పర్ల రాకపోకలను రైతులు అడ్డుకుని నిరసన తెలియజేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. మొత్తంమీద సల్కాపురం,జోకన్‌గట్టు గుట్టల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌లకు మైనింగ్ అధికారుల అనుమతులు ఉన్నట్లా? లేక లేనట్లా? అనుమానాలు వీడడం లేదు. పేలుళ్ల కారణంగా వ్యక్తి మృతి చెందిన ఘటనలో బాధ్యులుగా గుర్తించిన ముగ్గురిని బుధవారం సాయంత్రం గట్టు పోలీసులు రిమాండ్ కోసం గద్వాల కోర్టుకు తరలించారు.

అనుమతి పత్రాలు ఇవ్వలేదు

సల్కాపురం, జోకన్‌గట్టు గుట్టల్లో నిర్వహిస్తున్న మైనింగ్ పనులకు సంబంధించి అనుమతి పత్రాలను ఇప్పటి దాకా ఇవ్వలేదు. క్రషర్ నిర్వాహకులను అనుమతి పత్రాలు ఇవ్వాలని కోరాం. బుధవారం సాయంత్రం వరకు ఎలాంటి పత్రాలను మాకు సమర్పించలేదు.

– సరితారాణి, తహసీల్దార్

సారా తయారీ కేంద్రాలపై దాడులు



వెల్దండ: మండలంలోని నగారగడ్డ తండా, దుబ్బతండా, పోచమ్మగడ్డ తండాల్లో సారా తయారీ కేంద్రాలపై బుధవారం కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ డీటీఎఫ్ సీఐ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు 400 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారు చేస్తున్న వారిలో ఒకరిని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో సిబ్బంది రఘు, మాధవి, మహేష్, పరశురాం, నార్యా, తిరుపతిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్‌తండాలో నిల్వ ఉంచిన నల్లబెల్లం స్థావరంపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 161 బస్తాల్లో ఉన్న 480 కేజీల నల్లబెల్లం, 20 కేజీల పటిక, 4 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో సీఐలు జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, రాజ్యలక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు మాయం

- మైనస్ బ్యాలన్స్‌లో చేనేత కార్మికుల ఖాతాలు
- ముద్ర యోజన రుణాల సమయం గడవక ముందే అప్పు కిందకు జమ



చేనేత కార్మికుడి ఖాతాలో మైనస్‌లో చూపిస్తున్న బ్యాలెన్స్

రాజోళి: చేనేత కార్మికుల యూనియన్ బ్యాంకు బ్యాలెన్స్ బుధవారం మైనస్‌లోకి వెళ్లడంతో కార్మికులు కంగుతిన్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాజోళిలోని యూనియన్ బ్యాంకులో గతంలో తీసుకున్న ముద్ర యోజన రుణాలకు సంబంధించి కాలపరిమితి పూర్తి కాకముందే తమ ఖాతాలోని నగదును బ్యాంకు అధికారులు రుణం కిందకు జమ చేసుకున్నారని రాజోళి చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 36 నెలల కాలపరిమితి ఉన్న ఈ ముద్ర యోజనలో తమకు ఇంకా సమయం ఉందని వాపోతున్నారు.

రూ.50 వేల చొప్పున రుణం..

రాజోళిలోని కార్మికులు గతంలో యూనియన్ బ్యాంకులో రూ.50 వేల చొప్పున రుణం తీసుకున్నారు. అప్పుడు మేనేజర్‌గా ఉన్న రవిప్రకాష్ ఈ రుణాల ప్రక్రియను పరిశీలించి పూర్తి చేశారు. కాగా కార్మికుల వివరాలు, దరఖాస్తుల పరిశీలన ఇతర అంశాల పరిశీలనకు తీసుకున్న సమయాన్ని కూడా రుణ కాలపరిమితిలోకి నమోదు చేశారని, దాంతో 8 నెలల ముందుగానే గడువు ముగిసినట్లుగా చూపుతుందన్నారు. కాని ఈ విషయం అప్పటి బ్యాంకు మేనేజర్ కార్మికులకు తెలియజేయలేదన్నారు. నేటి వరకు ఈ విషయం తమకు తెలియదన్నారు. బుధవారం కార్మికుల ఖాతాల్లో నగదు ఉంటే ఆ నగదు అప్పు కిందకు జమకావడం, ఖాతాలో నగదు లేకుంటే మైనస్ బ్యాలెన్స్ చూపుతుండటంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. రుణాల కోసం కార్మికుల వివరాలను సర్వే చేసిన రోజులను కూడా రుణం తీసుకున్న రోజుల కిందకు లెక్క వేసి నమోదు చేశారు. దీంతో 7 నుంచి 8 నెలల ముందుగానే కాలపరిమితి ముగిసి, తమ ఖాతాల్లో డబ్బులు ఖాళీ అవుతున్నాయని వాపోతున్నారు. ఇంకా సమయం ఉందనుకుని ప్రతినెల మాదిరిగానే బైక్ చెల్లింపులు, ఇంటి రుణాల చెల్లింపులు, ఇతర చెల్లింపులకు బ్యాంకులో దాచుకున్న నగదును యూనియన్ బ్యాంక్ అధికారులు అప్పు కిందకు జమ చేసుకోవడంతో కార్మికులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతంలో ఉన్న బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్యంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ స్పందించి, కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మూడేళ్లు ముగిసింది..

2021 ఆగస్టులో చేనేత కార్మికులకు ఇచ్చిన ముద్ర రుణాల సమయం ముగిసింది. మూడేళ్ల కాలపరిమితితోనే ఈ రుణాలను ఇచ్చాం. చేనేత కార్మికులు ఇంకా సమయం ఉందని అంటున్నప్పటికీ, రుణానికి సంబంధించి బ్యాంకు ఖాతా తెరిచినప్పటి నుంచి కాలపరిమితి మొదలవుతుంది. అలా కార్మికులు తీసుకున్న రుణానికి సమయం ముగిసింది. దీంతో వారి ఖాతాల్లోని నగదును జమ చేసుకున్నాం. సమయం ముగిసిన కార్మికులకు కొత్తగా రుణాలు ఇస్తాం.

– నవనీత్ కుమార్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, రాజోళి

తండ్రి గొంతుకోసిన కుమారుడు

- ప్లాటు ఇవ్వకపోవడంతో ఘాతుకం
- చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలింపు


ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కల్లప్ప

భూత్పూర్: తనకున్న ఆస్తిని ఇద్దరు కుమారులకు పంచి ఇచ్చాడు. గ్రామంలో భార్య పేరుమీద ఉన్న ప్లాటును తన పేరు మీద చేయడం లేదనే కోపంతో కళ్లు కనిపించని తండ్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కుమారుడు కత్తిపీటతో గొంతు కోసిన సంఘటన బుధవారం మండలంలోని తాటికొండలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోట్ల సాయమ్మ, కల్లప్పకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. 140 గొర్రెలు ఉండగా.. కల్లప్ప ఇద్దరు కుమారులకు సమానంగా 70 గొర్రెల చొప్పున పంచి ఇచ్చాడు. ఇద్దరికి చెరో ఇల్లు నిర్మించి ఇచ్చాడు. కల్లప్ప భార్య సాయమ్మ పేరు మీద ఉన్న ప్లాటు సైతం తనకే ఇవ్వాలని చిన్న కుమారుడు కోట్ల శ్రీశైలం తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. శ్రీశైలం కొన్ని నెలల కిందట తన తండ్రిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో గొర్రెలను మేపడానికి తీసుకెళ్లాడు. మంగళవారం గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా వారం రోజుల కిందట గ్రామానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు ఇద్దరు పెద్ద కుమారుడితో ఉంటున్నారు. మంగళవారం బోనాల సందర్భంగా మద్యం తాగి తల్లిదండ్రుల వద్దకు వచ్చి చిన్నకుమారుడు ప్లాటు విషయంలో గొడవ పడ్డాడు. సాయమ్మ బుధవారం ఉదయం పర్దీపూర్‌లో తన అక్క గృహప్రవేశం నిమిత్తం వెళ్లగా.. పెద్ద కుమారుడు, కోడలు గొర్రెలు మేపడానికి వెళ్లారు. అదే అదును చూసుకొని మద్యం మత్తులో ఉన్న చిన్న కుమారుడు.. నిద్రిస్తున్న తండ్రి గొంతును కత్తిపీటతో కోసి ఇంటి ఎదుట కూర్చున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి దగ్గరకు వెళ్లి చూడగా.. కల్లప్ప గొంతు నుంచి రక్తం కారుతూ ఉంది. వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. చికిత్స నిమిత్తం కల్లప్పను జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలియజేశారు. కల్లప్ప భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు శ్రీశైలంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

క్లుప్తంగా...

ఎంత జనాభా? ఎన్ని నీళ్లు కావాలి?

- ఇండెంట్ సమర్పించాలన్న కృష్ణా బోర్డు
- తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు లేఖ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, సాగర్ టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బరాజ్‌ల పరిధిలో నివాసముంటున్న జనాభా ఎంత? ఆ జనాభా తాగునీటి అవసరాలకు ఎన్ని నీళ్లు అవసరమో ఇండెంట్ సమర్పించాలని తెలుగు రాష్ట్రాలను కృష్ణా బోర్డు కోరింది. ఈ మేరకు కృష్ణా బోర్డు సభ్యుడు ఆర్‌ఎం శంఖువా తెలంగాణ, ఏపీలకు తాజాగా లేఖ రాశారు. ప్రాజెక్టుల కింద జిల్లాలు, మండలాల వారీగా జనాభా లెక్కలు, తాగునీటి అవసరాలను సెప్టెంబర్ 15లోగా తెలియజేయాలని కోరారు. 2024–25 వానాకాలం పంటల అవసరాలకు శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి 135.5 టీఎంసీలను కేటాయించాలని తెలంగాణ ఇటీవల కోరింది. నల్లగొండ ఎడమ కాల్వ కింద నల్లగొండ సీఈ పరిధిలో తాగునీటికి 1.5 టీఎంసీలు, సాగునీటికి 15.5 టీఎంసీలు, సూర్యాపేట సీఈ కింద సాగునీటికి 18 టీఎంసీలు, ఖమ్మం సీఈ కింద తాగునీటికి 3.78 టీఎంసీలు, సాగునీటికి 31.72 టీఎంసీలు, ఎమ్మార్పీ హైలెవల్ కెనాల్, లో లెవల్ కాలువల కింద తాగునీటికి 7.5 టీఎంసీలు, సాగునీటికి 24 టీఎంసీలు, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కల్వకుర్తి లిఫ్టుకు 31.1 టీఎంసీలు సాగునీటికి, 2.4 టీఎంసీలు తాగునీటికి కేటాయించాలని కోరుతూ తెలంగాణ ఇండెంట్ సమర్పించింది.

నెబ్రాస్కాలో దీపావళి పండుగకు అధికారిక గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: నెబ్రాస్కా గవర్నర్ జిమ్ పిల్లెన్ కార్యాలయం భారతీయ పండుగ దీపావళిని అధికారికంగా గుర్తించింది. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2 వరకు దీపావళి వారంగా ప్రకటించింది. అంతేకాకుండా నెబ్రాస్కా రాష్ట్రంలో అక్టోబర్ నెలను హిందూ వారసత్వ నెలగా గుర్తించారు. పురాతన హిందూ సాంస్కృతిక వారసత్వం, సనాతన ధర్మం, సంప్రదాయాలను సంరక్షించడానికి అమెరికాలోని భారతీయ హిందూ సమాజం చేసిన గణనీయమైన కృషి కారణంగా ఈ గుర్తింపు సాధ్యమైంది. నెబ్రాస్కాలోని హిందువులు దీపావళిని ఘనంగా జరుపుకోవాలని అక్కడి హిందూ నాయకులు కోరారు. ఈ సందర్భంగా దీపావళి విశిష్టతను తెలిపిన డాక్టర్ ఫణి తేజ్ అడిదమ్‌కు హిందూ సమాజం తరఫున వారు ధన్యవాదాలు తెలిపారు.




ఏపీ రాష్ట్ర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ప్రమాణం చేశారు. బుధవారం హైకోర్టులో జరిగిన కార్యక్రమంలో వీరిద్దరితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.

రూ.1,226 కోట్లతో.. పోలవరం ఎడమ కాలువకు ‘లిఫ్ట్’

- రేషన్ డోర్ డెలివరీ రద్దు.. కొత్తగా 2,774 రేషన్ షాపుల ఏర్పాటు
- రివర్స్ టెండర్ల విధానానికీ మంగళం
- ఏపీ కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి

సాక్షి, అమరావతి: పోలవరం ఎడమ కాలువకు లిఫ్ట్ ద్వారా నీటిని తోడిపోయడం ద్వారా ఉత్తరాంధ్ర తాగు, పారిశ్రామిక అవసరాలను తీర్చాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.1,226.68 కోట్లతో ఎడవ కాలువ పనులు పూర్తిచేయాలనే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. సచివాలయంలో బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశ వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు. విశాఖపట్నానికి లిఫ్ట్ విధానంలో ముందుగా నీరు అందించి, పోలవరం పూర్తయిన తర్వాత గ్రావిటీ ద్వారా పూర్తిస్థాయిలో అందిస్తామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండర్ విధానం రద్దుచేసి పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ కోసం విడుదల చేసిన జీఓ–67ను రద్దుచేయడంతోపాటు అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలోని పనులను రివర్స్ టెండరింగ్‌కు బదులుగా సంప్రదాయ టెండర్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే గత ప్రభుత్వం అమలుచేసిన రేషన్ డోర్ డెలివరీ విధానం రద్దుచేసి దాని స్థానంలో కొత్తగా 2,774 రేషన్ దుకాణాల ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని పార్థసారథి చెప్పారు. ఇక పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ పేరు, బొమ్మలు, రాజకీయ పార్టీల లోగో తొలగించి దాని స్థానంలో రాజముద్రను ముద్రించి 21.86 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపిందని చెప్పారు.

ఖజానాకు కన్నం!

- అంచనాలు పెంచేసి నాడు అధిక ధరలకు కట్టబెట్టిన చంద్రబాబు
- ఆ తర్వాత మొబిలైజేషన్ అడ్వాన్సులు.. కాంట్రాక్టర్ల నుంచి అవే కమీషన్లుగా వసూలు
- ఆ అక్రమ వ్యవహారాలతో ఖజానాపై రూ.20 వేల కోట్లకుపైగా పెనుభారం
- మళ్లీ 2014–19 పాత టెండర్ విధానం అమలుకు కూటమి సర్కారు గ్రీన్ సిగ్నల్
- పట్టిసీమ టెండర్ల అక్రమాలను 2017–18లోనే కడిగేస్తూ కాగ్ నివేదిక
- మళ్లీ ఇప్పుడూ అదే రీతిలో కాంట్రాక్టర్లతో కలిసి ఖజానా దోచేసేందుకు సిద్ధం
- అధికారంలోకి రాగానే టెండర్ల వ్యవస్థను సంస్కరించిన వైఎస్ జగన్
- రూ.వంద కోట్లు అంతకంటే ఎక్కువ విలువైన పనుల టెండర్ జ్యుడీషియల్ ప్రివ్యూకు
- రూ.కోటి అంతకంటే ఎక్కువ విలువైన పనులకు రివర్స్ టెండరింగ్‌లో టెండర్లు
- అత్యంత పారదర్శక టెండర్లలో పాల్గొనేందుకు కాంట్రాక్టర్లు పోటాపోటీ.. కాంట్రాక్టు విలువ కంటే తక్కువకే పనులు చేసేందుకు ముందుకొచ్చిన కాంట్రాక్టర్లు

రివర్స్ టెండరింగ్ రద్దుకు ఏపీ కేబినెట్ ఆమోదం



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మూత‘బడి’నది!



తాళం వేసిన బడి మెట్లపై కూర్చున్న విద్యార్థులు

కౌటాల(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం మొగడ్‌దగడ్‌లోని గిరిజన ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో 25 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయిని సుశీల ఇటీవల బదిలీపై వెళ్లగా.. మరో టీచర్‌ను కేటాయించలేదు. దీంతో వారం రోజులుగా బడి తలుపులు తెరుచుకోవడం లేదు. విద్యార్థులంతా బుధవారం ఉదయం తొమ్మిది గంటలకే పాఠశాలకు చేరుకున్నారు. తాళం వేసి ఉండటంతో అక్కడే కాసేపు ఆడుకుని ఇళ్లకు తిరిగి వెళ్లారు. దీనిపై స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్‌పర్సన్ మడావి పోచానిని వివరణ కోరగా.. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో టీచర్లను సర్దుబాటు చేస్తారని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్లు ఆమోదం!

- సవరించిన అంచనాలకు గ్రీన్ సిగ్నల్
- కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్న కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు
- అధికారిక మీడియా సమావేశంలో ప్రస్తావించని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈమేరకు జలశక్తి శాఖకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన సవరించిన అంచనాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు మీడియాకు తెలిపారు. కొత్త డయాఫ్రమ్ వాల్ సహా పెరిగిన అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. డబుల్ ఇంజన్ గ్రోత్ ఓరియెంటెడ్ ప్రభుత్వం కారణంగా ఇది సాధ్యమైందని చెప్పారు. అయితే, కేంద్ర కేబినెట్ నిర్ణయాలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన అధికారిక మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పోలవరం ప్రాజెక్టును ప్రస్తావించకపోవడం గమనార్హం.

జాయింట్ సర్వే!

పోలవరం ముంపుపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు సీడబ్ల్యూసీ చైర్మన్ ఆదేశం

- 150 అడుగుల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో ఉండే ప్రభావంపై అధ్యయనం చేయాలి
- క్షేత్రస్థాయిలో ముర్రెడువాగు, కిన్నెరసాని వాగుల ముంపుపై డీమార్కింగ్ చేయాలి
- ముంపు గుర్తించిన తర్వాత నివారణ చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టులో 150 అడుగుల గరిష్ట నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్) మేరకు నీళ్లను నిల్వ చేస్తే తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ (పీపీఏ) ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించాలని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ కుశ్వీందర్ సింగ్ వోరా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టుతో కిన్నెరసాని, ముర్రెడువాగులకు ఏర్పడనున్న ముంపుపై ఎన్జీటీ ఆదేశాల మేరకు ఇప్పటికే జాయింట్ సర్వే నిర్వహించగా, తదుపరిగా క్షేత్రస్థాయిలో ముంపు ప్రాంతాన్ని గుర్తిస్తూ డీమార్కింగ్ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాలతో తక్షణమే జాయింట్ సర్వే నిర్వహించి డీమార్కింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని వోరా ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావానికి సంబంధించి తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాష్ట్ర ప్రభుత్వాల అభ్యంతరాలపై బుధవారం ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో వోరా అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఎప్పటికైనా సర్వే చేయాల్సిందే: వోరా

పోలవరం ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ ఎప్పటికైనా 150 అడుగులే ఉంటుందని, దీనివల్ల తెలంగాణలో ఉండనున్న ముంపు ప్రభావంపై ఎప్పుడైనా సర్వే చేసి నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్వే జరగకపోవచ్చని, ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో తెలంగాణ కోరిన మేరకు జాయింట్ సర్వే చేయాల్సిందేనని సూచించారు. జాయింట్ సర్వేను సమన్వయం చేయాలని పీపీఏను ఆదేశించారు. 150 అడుగుల నిల్వతో ఏర్పడే ముంపుతో పాటు ప్రాజెక్టు కారణంగా ముర్రెడు వాగు, కిన్నెరసాని వాగులకు ఉండే ముంపును గుర్తించి నివేదిక సమర్పిస్తే, ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏపీ, తెలంగాణతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తెలంగాణ కోరిన మేరకు.. పోలవరం ప్రాజెక్టుతో మిగిలిన 5 వాగులకు ఉండనున్న ముంపుపై జాయింట్ సర్వే విషయంలో మళ్లీ సమావేశమై నిర్ణయం తీసుకుందామని చెప్పారు. కాగా పోలవరం ప్రాజెక్టుతో సీడబ్ల్యూసీ సర్వేలో తేలిన దానికి మించి తమ రాష్ట్రంలో ముంపు ప్రభావం ఉందని ఒడిశా నీటిపారుదల శాఖ సీఈ అశుతోష్ దాస్ పేర్కొన్నారు. ఐఐటీ రూర్కెలా అధ్యయన నివేదికలో ఇది తేలిందన్నారు. ఈ నివేదికపై అధ్యయనం చేసి తదుపరి సమావేశంలో చర్చిస్తామని సీడబ్ల్యూసీ చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ మోహన్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం, పీపీఏ సీఈఓ అతుల్ జైన్, సీఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలాంటి పురోగతి లేదు: తెలంగాణ

గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు జాయింట్ సర్వేకు ఏపీ ప్రభుత్వం ముందుకు రావడం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) బి.నాగేందర్‌రావు తెలియజేశారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదని, కాగితాలకే పరిమితమయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. 150 అడుగుల ఎఫ్‌ఆర్‌ఎల్‌తో తెలంగాణలో 950 ఎకరాలు ముంపునకు గురవుతాయని, దీనిపై జాయింట్ సర్వే చేయాల్సిందేనని ఆయన కోరారు. మరోవైపు జాయింట్ సర్వేకు తెలంగాణ సహకరించడం లేదని, సర్వే రెండు వాగులకే పరిమితం చేయాల్సి ఉండగా, ఏడు వాగులు సర్వే చేయాలని కోరుతోందని ఏపీ అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈ శ్రీనివాసరావు చెప్పారు. అయితే ముర్రెడు వాగు, కిన్నెరసాని వాగుల జాయింట్ సర్వేకు పూర్తిగా సహకరించిన విషయాన్ని తెలంగాణ ఈఎన్సీ గుర్తు చేశారు.

పోతులపాడులో సంబరాలు


- ఎస్‌బీఐ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గ్రామవాసి చల్లా శ్రీనివాసులుశెట్టి

మానవపాడు: మండలంలోని పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి ఎస్‌బీఐ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడంతో గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం ఎస్‌బీఐ చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి బాధ్యతల స్వీకరణ సందర్భంగా గ్రామంలో ఆయన బాల్య స్నేహితులు వై.సోమశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జయరాం రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ఎంఈఓ శివప్రసాద్, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ చైతన్య, అలంపూర్ ఫీల్డ్ ఆఫీసర్ తిరుమలేశ్, పాఠశాల హెచ్‌ఎం రామిజ్‌బీ హాజరై ఆయన సేవలను కొనియాడారు. ఆయన చదివిన పాఠశాలకు రెండు టీవీలు, ఒక ప్రొజెక్టర్, జిరాక్స్ మిషన్, విద్యార్థులకు మెటీరియల్, అంగన్‌వాడీ పాఠశాలకు కుర్చీలు, టీవీ, ఆటవస్తువులు అందించారు.



పెద్దపోతులపాడులో బాణసంచా కాలుస్తున్న గ్రామస్తులు

జూరాల ప్రాజెక్టుకు భారీ వరద



జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- 2.44లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 40 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. 2.44 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 40 క్రస్టు గేట్లను ఎత్తి గేట్ల ద్వారా 2,62,288 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 92, కుడి కాల్వ ద్వారా 650, ఎడమ కాల్వకు 820, కోయిల్‌సాగర్‌కు 630, భీమా లిఫ్టు–2కు 750, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 50క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,85,704 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.512 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 1,34,108 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి 1.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 119.41 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1.55లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 30 గేట్లను ఎత్తి 18,910 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 28.49 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం నాటికి పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 900 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

ఒక గేటు ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాం నుంచి ఒక గేటు ద్వారా దిగువకు నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 3,813 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, 1,368 క్యూసెక్కులు దిగువకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ పేర్కొన్నారు.

తగ్గిన విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గుముఖం పట్టింది. బుధవారం 9 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 118.433 మిలియన్ యూనిట్లు, దిగువలో 4 యూనిట్ల ద్వారా 160 మెగావాట్లు, 97.386 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటి వరకు 215.819 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం 21,539 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

మరింత పెరిగిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.4,300.. కనిష్టంగా రూ.3,650

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన బహిరంగ వేలంలో ఉల్లి ధర మరింత పెరిగింది. రికార్డు స్థాయిలో క్వింటాల్ ధర గరిష్టంగా రూ.4,300 పలకగా.. కనిష్టంగా రూ.3,650 వచ్చింది. ఇక సన్నగా ఉన్న ఉల్లి క్వింటాల్ రూ.3 వేల వరకు ధర పలికింది. మార్కెట్‌లో వ్యాపారులు 45 కిలోల ఉల్లి బస్తా ధర గరిష్టంగా రూ.2,150, కనిష్టంగా రూ.1,850, మధ్యస్థంగా రూ.2 వేల వరకు అమ్మకాలు సాగించారు. చిన్నసైజు ఉల్లి బస్తా ధర రూ.1,500లకు విక్రయించారు. మార్కెట్‌కు దాదాపు 200 బస్తాల ఉల్లి అమ్మకానికి రాగా.. వ్యాపారులు వేలం వేసి కొనుగోలు చేశారు.



మార్కెట్‌లో ఉల్లి తూకం వేస్తున్న సిబ్బంది

అమ్మవారి బంగారు పతకం బహూకరణ

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ అమ్మవారికి బుధవారం కడప జిల్లాకు చెందిన భక్తుడు చంద్రమౌళీశ్వర్‌రెడ్డి రూ.10 లక్షల విలువ చేసే సరస్వతి అమ్మవారి బంగారు పతకాన్ని బహూకరించినట్లు ఈఓ పురేందర్ తెలిపారు. 133.84 గ్రాముల బరువు ఉన్నట్లు దేవస్థాన కార్యాలయం తెలిపింది. గతంలో కూడా ఈయన మహాకాళి, మహాలక్ష్మి బంగారు పతకాన్ని ఇచ్చినట్లు ఈఓ తెలిపారు. కాగా బాల బ్రహ్మేశ్వర ఆలయంలో విద్యుద్దీకరణ పనులు కొనసాగుతున్నాయి. వీటిని ఈఓ పరిశీలించారు. గోశాల పనులను వారు పరిశీలించి నాణ్యతతో చేపట్టాలని సూచించారు.



ఈఓ పురేందర్‌కుమార్‌కు బంగారు పతకాన్ని అందజేస్తున్న భక్తుడు చంద్రమౌళీశ్వర్‌రెడ్డి

ఇద్దరి రైతుల ఉసురు తీసిన కరెంట్



- వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతాలు
- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

గద్వాల క్రైం/అడ్డాకుల: ఉమ్మడి జిల్లాలో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృత్యువాత పడగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. గద్వాల మండల పరిధిలోని జమ్మిచేడ్‌కి చెందిన బోయకృష్ణ(45) బుధవారం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో పనులు చేసేందుకు వెళ్లాడు. అయితే దగ్గరలోని బోర్ మోటార్ ఆన్ చేసేందుకు స్విచ్ బటన్ నొక్కాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని తెలియజేశారు. మృతుడికి భార్య రుక్మిణి, కుమార్తె ఉన్నారు.

➪ మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని చౌడాయపల్లికి చెందిన సున్నపు లక్ష్మయ్య(55) తన వ్యవసాయ పొలంలో మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడు. అక్కడ స్టార్టర్ బటన్ నొక్కుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. అక్కడే కిందపడి ప్రాణాలు వదిలాడు. తర్వాత కొద్ది సేపటికి పొలం పనుల నిమిత్తం లక్ష్మయ్య కుమారుడు రమేష్ అక్కడికి వచ్చారు. స్టార్టర్ డబ్బా వద్ద చనిపోయి పడి ఉండటంతో బోరున విలపించాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అందరు కలిసి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య మణెమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

పొలంలో కలుపు తీసేందుకు వెళ్లి..

మద్దూరు: వరిపొలంలో కలుపు తీసేందుకు వెళ్లిన ఓ మహిళా కూలీ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడింది. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం జాదరావపల్లి తండాకు చెందిన రాములునాయక్ వరి పొలంలో కలుపు తీయడానికి జాదరావ్‌పల్లికి చెందిన కొంత మంది మహిళలు కూలీ పనులకు వెళ్లారు. కాగా.. పక్క పొలంలో జొన్న పంటను అడవిపందుల నుంచి కాపాడేందుకు సదరు రైతు కరెంట్ కంచె వేశారు. ఈ క్రమంలో అక్కడే కలుపు తీస్తున్న లక్ష్మమ్మ మెడకు విద్యుత్‌వైరు తగలడంతో షాక్‌కు గురైంది. వెంటనే ఆమెను కలుపు తీసున్న మద్దూరు.. అక్కడి నుంచి నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళితే కుటుంబసభ్యులు రావాలని ఎస్‌ఐ చెప్పినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఇదే విషయంపై ఎస్‌ఐ రాంలాల్‌ను అడుగగా సమగ్ర విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తుండగా..

గట్టు: చాగదోన శివారులోని వ్యవసాయ పొలం దగ్గర బుధవారం సాయంత్రం విద్యుతాఘాతంతో రైతు మునిస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మరమ్మతులు చేస్తున్న క్రమంలో షాక్‌కు గురయ్యాడు. చుట్టు పక్కల వారు గమనించి వెంటనే మునిస్వామిని అయిజ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

బాలుడి ప్రాణానికి ఖరీదు..

- వైద్యం వికటించి ఎనిమిదేళ్ల చిన్నారి మృతి
- కుటుంబ సభ్యులు ఆందోళన చేయకుండా ఖరీదు కట్టిన పీఎంపీ

వనపర్తి రూరల్: వైద్యం వికటించి మృతిచెందిన బాలుడి ప్రాణానికి ఓ పీఎంపీ ఖరీదు కట్టాడు. స్థానికుల వివరాల మేరకు.. పెబ్బేరు పట్టణానికి విజయ్ – విజయలక్ష్మి కుమారుడు (8) మూడు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించారు. మూడు రోజులపాటు బాలుడికి ప్రథమ చికిత్స కేంద్రంలోనే పీఎంపీ వైద్యం అందించాడు. ఈ క్రమంలో బాలుడి పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. కాగా, బాలుడి తల్లిదండ్రులు, బంధువులు ప్రథమ చికిత్స కేంద్రం వద్ద ఎటువంటి ఆందోళన చేపట్టకుండా పీఎంపీ పట్టణంలోని ఓ నాయకుడిని ఆశ్రయించాడు. బాధిత కుటుంబ సభ్యులతో మధ్యవర్తుల ద్వారా చర్చలు జరిపి బాలుడి ప్రాణానికి రూ. లక్ష వరకు ఖరీదు కట్టినట్లు తెలిసింది. బాలుడికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించి ఉంటే ప్రాణం నిలిచేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. కాగా, ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ.. వాటిని తుంగలో తొక్కి స్థాయికి మించి వైద్యం అందిస్తున్నారని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ ఏటీఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఏటీఎం (టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్) కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఇసాక్ బిన్ అహ్మద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, కార్గో వినియోగదారులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పార్సిల్, కార్గో ఫిర్యాదులపై 81254 56978 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని కార్గో వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.